

'డబుల్'లో నంబర్‌వన్

డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాల్లో బాన్సువాడ నియోజకవర్గం అగ్రస్థానంలో ఉందని స్పీకర్ పోచారం పేర్కొన్నారు.

- 8లో ▸



సమస్యలు పరిష్కరించండి

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలని బీజేపీ నాయకులు కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను కోరారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
29.5 /22.1

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలు ప్రాంతాలలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

గుంతల దారిలో..

- అధ్వానంగా 44వ నంబరు జాతీయ రహదారి
- గుంతలతో ఇబ్బందిపడుతున్న వాహనదారులు

పేరుకు జాతీయ రహదారి.. అయినా నిర్వహణ అంతంత మాత్రంగానే ఉండడంతో గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెద్దపెద్ద గుంతలు ఉండడంతో 44 వ నంబరు జాతీయ రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి, కామారెడ్డి: బెంగళూరు నుంచి నాగ్‌పూర్ వరకు సాగే 44వ నంబరు జాతీయ రహదారి అధ్వానంగా మారింది. ఈ దారిపై రెండువైపులా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. జాతీయ రహదారి ఉన్న కామారెడ్డి, మెదక్, మేడ్చల్, నిజామాబాద్ తదితర జిల్లాల్లో దారి పొడవునా ఇదే పరిస్థితి నెలకొంది. మేడ్చల్ జిల్లా సరిహద్దుల్లోనుంచి మొదలుకొని మెదక్ జిల్లా తూప్రాన్, చేగుంట, రామాయంపేట, కామారెడ్డి జిల్లా భిక్కనూరు, జంగంపల్లి, అంతంపల్లి, బస్వాపూర్ కామారెడ్డి ప్రాంతాల్లో పెద్దపెద్ద గుంతలున్నాయి. చాలాచోట్ల రోడ్డు దెబ్బతినడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణం నరక ప్రాయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూడ్చకుంటే ప్రమాదమే..

44వ నంబర్ జాతీయ రహదారి మన రాష్ట్రంలో మేడ్చల్ నుంచి రాష్ట్ర సరిహద్దు ముగిసేవరకు సుమారు మూడు వందల కిలోమీటర్లు ఉంటుంది. ఈ రహదారిపై నిత్యం పాతిక వేలకుపైగా వాహనాలు తిరుగుతుంటాయి. దేశంలోని నలుమూలల నుంచి రవాణాకు సంబంధించి ఎన్నో వాహనాలు ఈ రహదారి మీదుగా వెళ్తుంటాయి. దూరం ప్రాంతాలనుంచి వాహనాలను నడిపేవారు ఎక్కడ గుంత ఉందో తెలియని పరిస్థితుల్లో ప్రమాదాల బారిన పడుతున్నారు. గుంతలు పూడిస్తేగానీ ప్రమాదాలను నివారించలేని పరిస్థితి ఉంది. జాతీయ రహదారుల నిర్వహణ సంస్థ అధికారులు దృష్టి సారించి, గుంతలను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.



భిక్కనూరు శివారులో హైవేపై ఏర్పడిన గుంతలు



ఎన్‌హెచ్-44పై భిక్కనూరు మండలం జంగంపల్లి వద్ద ఏర్పడిన గుంతలు

తరచూ ప్రమాదాలు..

హైవే మీద వాహనాలు దూసుకుపోతున్నపుడు గుంతలను తప్పించబోయే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల వరుసగా ఐదు నుంచి పది గుంతలు కనిపిస్తున్నాయి. గుంతల మీదుగా వెళ్లే వాహనాలు దెబ్బతింటున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో గుంతలు మరింత లోతుగా తయారయ్యాయి. రెండువైపులా గుంతలుండడంతో వాటిని తప్పించడానికి వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

కమలం వైపు ప్రొఫెసర్ చూపు!

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన డాక్టర్ కే రాంసింగ్
- ఎల్లారెడ్డి నుంచి పోటీ చేస్తారని ప్రచారం



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడితో రాంసింగ్(ఫైల్)

సాక్షి, కామారెడ్డి: గాంధారి మండలం రాంలక్ష్మణ్‌పల్లికి చెందిన ప్రముఖ సర్జన్, ప్రొఫెసర్ కే.రాంసింగ్ కమలం పార్టీ వైపు అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో సమావేశమయ్యారు. దీంతో ఆయన ఎల్లారెడ్డి నుంచి పోటీ చేస్తారన్న ప్రచారం ఊపందుకుంది.

సాధారణ గిరిజన కుటుంబంలో జన్మించిన రాంసింగ్ కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగారు. మంచి సర్జన్‌గా పేరు గడించారు. ఉస్మానియా మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఇటీవలే కామారెడ్డి మెడికల్ కాలేజీకి బదిలీపై వచ్చారు. జనరల్ సర్జన్‌గా ఆయనకు మంచి పేరుంది. ఆయన అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వైద్యం కోసం హైదరాబాద్‌కు వెళ్లిన వారికి సహాయం అందిస్తుంటారు. నియోజకవర్గం అంతటా విస్తృత పరిచయాలు ఉన్న డాక్టర్ కే.రాంసింగ్‌పై ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలన్న ఒత్తిడి ఉంది. ఈ నియోజకవర్గంలో గిరిజనులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. ఇందులో విద్యావంతుల సంఖ్యా అధికమే.. నియోజకవర్గంలో ఇరవై శాతానికిపైగా గిరిజనులు ఉంటారని అంచనా. ఇక్కడ ఇప్పటివరకు గిరిజనులెవరూ ఎమ్మెల్యేగా ఎన్నికవలేదు. గతంలో జమునారాథోడ్ పీఆర్‌పీ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. ఆమె గత ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. ఇటీవల వైఎస్సార్‌టీపీలో చేరారు. డాక్టర్ రాంసింగ్ స్థానికుడు కావడం, స్థానికంగా విస్తృత పరిచయాలు ఉండడంతో ఎన్నికల బరిలో నిలవాలని ఆయనకు చాలా మంది సూచిస్తున్నారు. ఇటీవల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని డాక్టర్ రాంసింగ్ కలిశారు. గిరిజన సమస్యల మీద ప్రముఖులతో బీజేపీ అధ్యక్షుడు చర్చించగా.. ఆ సమావేశానికి రాంసింగ్‌కు ఆహ్వానం అందింది. మాజీ ఎంపీ రవీంద్రనాయక్, బీజేపీ నేత హుస్సేన్ నాయక్ తదితరులతో కలిసి ఆయన సమావేశంలో పాల్గొన్నారని తెలుస్తోంది. రాష్ట్రంలో గిరిజనుల స్థితిగతులపై సమావేశంలో చర్చించినట్టు సమాచారం.

సామాజిక మాధ్యమాలలో..

జనరల్ సర్జన్‌గా మంచి గుర్తింపు ఉన్న ప్రొఫెసర్ రాంసింగ్ ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారన్న ప్రచారం ఊపందుకుంది. ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని కలిసిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. దీంతో వచ్చే ఎన్నికల్లో ఆయన ఎల్లారెడ్డి నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలుస్తారన్న ప్రచారం జరుగుతోంది.

మారనున్న రాజకీయ సమీకరణాలు..

డాక్టర్ రాంసింగ్ బీజేపీలో చేరితే ఎల్లారెడ్డి నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు మారుతాయని భావిస్తున్నారు. గిరిజనులు ఎక్కువ సంఖ్యలో ఉండడంతో వారు గెలుపు ఓటములను ప్రభావితం చేసే అవకాశాలున్నాయి. అదే సామాజికవర్గానికి చెందిన రాంసింగ్ పోటీ చేస్తే రాజకీయాల్లో అనేక మార్పులు జరుగుతాయని భావిస్తున్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి



ఈవీఎంల ప్రదర్శన కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్, నాయకులు

- అక్టోబర్ 4న తుది ఓటర్ల జాబితా
- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాజకీయ నాయకులు సహకరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆగస్టు 26, 27, సెప్టెంబర్ 2, 3 తేదీల్లో ఓటర్ల నమోదుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండేవారు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపొందించడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో 1,500 మంది కన్నా ఎక్కువ మంది ఓటర్లు ఉన్నట్లయితే మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసుకునే వీలుందని తెలిపారు. జిల్లాలో 790 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం పరిధిలో ఓటర్ల జాబితాకు ఆధార్ అనుసంధానం చేసే ప్రక్రియ 95 శాతం పూర్తయ్యిందన్నారు. వచ్చేనెల 21 న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రదర్శిస్తామని, అక్టోబర్ 4న తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తామని తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లోని ఈవీఎం ప్రదర్శన కేంద్రాన్ని ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు నరేందర్, అనిల్ కుమార్, సురేష్, ఖాసిం అలీ, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

'అప్రమత్తంగా ఉండాలి'

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం జిల్లా పోలీస్ అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు అవసరం లేని ప్రయాణాలు వాయిదా వేసుకోవాలన్నారు. ఏదైనా ప్రమాదం ఎదురయ్యే అవకాశం ఉందని గుర్తిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

వృద్ధ దంపతుల దారుణ హత్య

- నిందితుల కోసం జాగిలాలతో గాలింపు
- జంట హత్యలతో భయాందోళనలో ప్రజలు



హత్యకు గురైన సులోచన, నారాయణ(ఫైల్)

బాన్సువాడ: బీర్కూర్ మండలం రైతునగర్‌లో మంగళవారం రాత్రి జరిగిన జంట హత్యలు కలకలం రేపాయి. వివరాలిలా ఉన్నాయి.

సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్‌కు చెందిన దారం నారాయణ గుప్తా (75), సులోచన(65) దంపతులు పదేళ్ల క్రితం బతుకుదెరువు కోసం బీర్కూర్ మండలం రైతు నగర్ గ్రామానికి వచ్చారు. గ్రామంలో పెంకుటిల్లు కొనుగోలు చేసి నివసిస్తున్నారు. ఇంటి ముందున్న రేకుల షెడ్‌లో కిరాణ దుకాణం నడుపుతున్నారు. ఉన్న కాస్త డబ్బులను వడ్డీలకు ఇచ్చి కిరాణ దుకాణం నడుపుకుంటూ కాలం వెల్లదీస్తున్నారు. రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి వెనుకాల నుంచి చొరబడి ఇంట్లో ఉన్న నారాయణను రాడ్‌తో కొట్టి చంపగా ఆయన భార్య సులోచనను చీరతో ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. రోజు ఉదయమే లేచి కిరాణ దుకాణం తెరిచే దంపతులు తలుపులు తీయకపోవడంతో ఇంటి ముందున్న ఓ వ్యక్తి ఇంటి తలుపులు తీసి చూడగా నారాయణ ఓ గదిలో చని పోయి ఉండగా వెనకాల ఉన్న గదిలో సులోచన మృతదేహం పడి ఉంది. దీంతో వెంటనే స్థానికులకు, పోలీసులకు సమాచారం అందించారు. బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, బాన్సువాడ రూరల్ సీఐ మురళి వచ్చి ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లను పిలిచి విచారణ చేపట్టారు. డాగ్ స్క్వాడ్ మృతదేహాల వాసన చూసి గ్రామంలోని మిర్జాపూర్ రోడ్డులో ఉన్న రైతు వేదిక వరకు వెళ్లి తిరిగి మృతుల ఇంటికి వచ్చింది. మృతదేహాలకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతులకు సంతానం లేకపోవడంతో బంధువులే అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు.

వడ్డీకి డబ్బులు తీసుకున్న వారిపై ఆరా..

రైతునగర్ గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు నారాయణ వడ్డీలకు డబ్బులు ఇచ్చే వాడు. అందులో ఎక్కువగా పేకాడే వారే ఉన్నట్లు తెలిసింది. ఈ మధ్య రైతునగర్ గ్రామ శివారులోని మంజీర ప్రాంతంలో పెద్ద ఎత్తున పేకాట స్థావరం ఏర్పాటు చేసినట్లు తెలిసింది. పేకాడే వారికి అధిక వడ్డీకి డబ్బులు ఇచ్చి వారం పది రోజుల్లో డబ్బులు చెల్లించేలా ప్రామిసరీ నోట్లు, రూ.10 స్టాంప్ పేపర్లపై రాసుకుని డబ్బులు ఇచ్చే వారని తెలిసింది. పోలీసులు ఇదే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మంగళవారం రోజున బ్యాంకులో రూ.30 వేలు డ్రా చేసినట్లు తెలిసింది. వడ్డీకి డబ్బులు ఇచ్చిన వారిని డబ్బుల కోసం ఒత్తిడి తేవడంతోనే హత్యలు చేశారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు నారాయణ వద్ద వడ్డీకి డబ్బులు తీసుకున్న వారిని విచారిస్తున్నట్లు తెలిసింది.

'సమాజ భాగస్వామ్యంతోనే అభివృద్ధి'



మాట్లాడుతున్న డీఈవో రాజు

సదాశివనగర్: సమాజ భాగస్వామ్యంతోనే పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని డీఈవో రాజు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో శాలసిద్ధి కార్యక్రమంపై జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని 31 పాఠశాలలకు చెందిన 70 మంది టీచర్లు పాల్గొన్నారు. శాలసిద్ధి(పాఠశాలల స్వీయ మూల్యాంకనం)పై అవగాహన కల్పించారు. ఆయా పాఠశాలల్లో మౌలిక వసతులు, ఎస్ఎంసీ సమావేశాల తీరు, నిర్ణయాల అమలు తదితర అంశాలపై చర్చించారు. ఎస్ఎంసీ సమావేశాల్లో ఎజెండా అంశాలను పరిష్కరిస్తున్నారా లేదా అనే విషయాలను గుర్తుంచుకోవాలని డీఈవో సూచించారు. పాఠశాలలు మరింత మెరుగుపడడానికి ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో యోసెఫ్, కోఆర్డినేటర్‌లు శ్రీపతి, వేణుశర్మ, రమణరావు, గంగాకిషన్, ఆర్పీలు నర్సింగ్ రావు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

విరామమిస్తూ.. వర్షిస్తూ..

- జిల్లాను వదలని వరుణుడు
- నిండుకుండల్లా మారుతున్న చెరువులు
- నిజాంసాగర్ ప్రాజెక్టులోకి పెరిగిన ఇన్‌ఫ్లో

సాక్షి, కామారెడ్డి: అల్పపీడన ప్రభావం జిల్లాపైనా కనిపిస్తోంది. నిన్నమొన్నటి దాకా దంచికొట్టిన వాన.. బుధవారం పగలు కాస్త విరామం ఇచ్చినట్టే ఇచ్చినా రాత్రికి తిరిగి షురూ అయ్యింది. ఇప్పటికే సాధారణానికి మించి కురిసిన భారీ వర్షాలతో జలవనరులు నిండుకుండల్లా మారాయి. పోచారం, సింగితం, కల్యాణి ప్రాజెక్టులు వారం రోజులుగా పొంగుతున్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్టులో పది రోజుల్లో పది టీఎంసీల నీరు వచ్చి చేరింది. 17.802 టీఎంసీల సామర్థ్యం ఉన్న ప్రాజెక్టులోకి సాయంత్రం 6 గంటల వరకు 13.864 టీఎంసీలకు చేరింది. బుధవారం సాయంత్రం 14,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఇన్‌ఫ్లో ఇలాగే కొనసాగితే మరో రెండు, మూడు రోజుల్లో నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తే పరిస్థితి వస్తుందని నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్ తెలిపారు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. వాగులు, ప్రాజెక్టుల్లోకి ఎవ్వరూ వెళ్లవద్దని అధికారులు సూచించారు. జిల్లాలో నీటి పారుదల శాఖ నాలుగు డివిజన్ల పరిధిలో 1,515 చెరువులు, కుంటలు ఉండగా.. ఇప్పటివరకు 467 చెరువులు అలుగులు పారాయి. 480 చెరువులు నిండుకుండలుగా మారాయి. మిగతా చెరువుల్లో 50 శాతం వరకు నీరు చేరింది. రెండు మూడు రోజుల్లో అన్ని చెరువులు అలుగులు పారుతాయని భావిస్తున్నారు.



కల్యాణి ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు

కల్యాణిలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

ఎల్లారెడ్డిరూరల్: తిమ్మారెడ్డి శివారులోని కల్యాణి ప్రాజెక్టులోకి బుధవారం 150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ప్రాజెక్టు రెండు గేట్ల ద్వారా అంతే నీటిని మంజీర నదిలోకి వదులుతున్నామని ఏఈ శివప్రసాద్ తెలిపారు.

జిల్లాలోని చెరువుల వివరాలు..

డివిజన్	చెరువులు	అలుగులు పారినవి	75 శాతం నిండినవి	సగం నిండినవి
బాన్సువాడ	185	86	86	13
నిజాంసాగర్	400	08	117	275
కామారెడ్డి	370	105	81	184
ఎల్లారెడ్డి	560	268	196	96
మొత్తం	1,515	467	480	568

డీఎస్‌వోగా మల్లికార్జున్ బాబు



మల్లికార్జున్ బాబు, డీఎస్‌వో
నిత్యానంద్, ఏఎస్‌వో

కామారెడ్డి క్రైం: జిల్లా పౌర సరఫరాల అధికారిగా మల్లికార్జున్ బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన భద్రాద్రి కొత్తగూడెం నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి డీఎస్‌వోగా పని చేసిన పద్మ స్థానంలో డీఎస్‌వోగా బాధ్యతలు చేపట్టారు.

ఏఎస్‌వోగా నిత్యానంద్..

కామారెడ్డి ఏఎస్‌వోగా నిత్యానంద్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన వెంకటేశ్వర్లు నిజామాబాద్‌కు బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో కొద్ది రోజులుగా ఏఎస్‌వో పోస్టు ఖాళీగా ఉంది. ఆయన స్థానంలో నల్గొండ ఏఎస్‌వోగా పనిచేస్తున్న నిత్యానంద్‌ను ఇక్కడికి బదిలీపై పంపించారు.

న్యూస్‌రీల్

ఏఎస్పీగా ప్రభాకర్‌రావు

సాక్షి, కామారెడ్డి: జిల్లా అడిషనల్ ఎస్పీగా ఆర్.ప్రభాకర్‌రావు నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన అన్యోన్య పదోన్నతిపై సీఐడీ ఎస్పీగా బదిలీ అయిన విషయం తెలిసిందే.. పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న ఆర్.ప్రభాకర్‌రావును కామారెడ్డి ఏఎస్పీగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

నేటితో ముగియనున్న రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ షాపుల ద్వారా అందజేస్తున్న జూలై నెలకు సంబంధించిన ఉచిత బియ్యం పంపిణీ గురువారంతో ముగియనుంది. ఇప్పటివరకు బియ్యం తీసుకోనివారు ఈ విషయాన్ని గమనించాలని రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గౌరిశెట్టి రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి టౌన్: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం వచ్చేనెల 2వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ఎస్ఏలు, ఎస్జీటీలు, తత్సమాన కేడర్, రెసిడెన్షియల్ పాఠశాలల ఉపాధ్యాయులు రెండు సెట్ల దరఖాస్తులను డీఈవో కార్యాలయంలో అందించాలని సూచించారు.

నేటినుంచి ఆర్టీసీలో టీ9-30 సేవలు

కామారెడ్డి టౌన్: ఆర్టీసీ టీ9-30 టికెట్ సేవలు ప్రారంభించిందని కామారెడ్డి డిపో మేనేజర్ లక్కు మల్లేశం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ప్రారంభించిన టీ9-60 సేవలు విజయవంతం కావడంతో ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. పల్లె వెలుగు బస్సులో రూ. 50 చెల్లిస్తే రాను పోను 30 కిలోమీటర్ల వరకు ప్రయాణించే వెసులుబాటు ఉంటుందని పేర్కొన్నారు. టికెట్టు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు మాత్రమే చెల్లుబాటు అవుతుందని తెలిపారు. గురువారంనుంచి ఈ సేవలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

కామారెడ్డి బల్దియా కమిషనర్‌కు పదోన్నతి

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ గ్రేడ్-2 కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.దేవేందర్‌కు గ్రేడ్-1 కమిషనర్‌గా పదోన్నతి లభించింది. పదోన్నతి లభించినా ఆయన కామారెడ్డిలోనే కొనసాగనున్నారు. కమిషనర్‌కు మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి, వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, అధికారులు, కౌన్సిలర్‌లు అభినందనలు తెలిపారు.

ఎస్టీవో కార్యాలయం తనిఖీ



ఎల్లారెడ్డి: పట్టణంలోని ఎస్టీవో కార్యాలయాన్ని డీటీవో సాయిబాబా బుధవారం తనిఖీ చేశారు. 2022-2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రికార్డులను వారు పరిశీలించారు. వార్షిక తనిఖీలో భాగంగా రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు. ఆయన వెంట ఏటీవో సురేష్, ఎస్టీవో సాయిరెడ్డి తదితరులున్నారు.

బాలుర వసతి గృహం..



పెద్దకొడప్‌గల్: మండలంలోని చవణి తండా సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని డీటీడీవో శ్రీనివాస్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. సమస్యలు ఏవైనా ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని వారు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని వార్డెన్ దశరథ్‌కు సూచించారు.

స్తంభాలను తాకొద్దు

నిజామాబాద్‌నాగారం: వర్షాల నేపథ్యంలో రైతులు, వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు ఒక ప్రకటనలో సూచించారు. తడి చేతులతో స్తంభాలు, విద్యుత్ వైర్లు, పరికరాలను తాకవద్దని పేర్కొన్నారు.

క్లుప్తంగా

నటేశ్వర శర్మకు జీవన సాఫల్య పురస్కారం


డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ

కామారెడ్డి అర్బన్: దాశరథి కృష్ణమాచార్య పురస్కారం పొందిన కామారెడ్డికి చెందిన కవి, రచయిత, అష్టావధాని డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మను ఇందూరు, శ్రీపాద సాహితీ కళాపీఠం జీవన సాఫల్య పురస్కారానికి ఎంపిక చేసింది. ఈనెల 30న మధ్యాహ్నం నిజామాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని గీతాభవన్‌లో నిర్వహించే దాశరథి–సినారె సినీ సంగీత విభావరి కార్యక్రమంలో నటేశ్వరశర్మకు పురస్కారం ప్రదానం చేయనున్నారు.

కళాశాల సాధించడంలో ప్రభుత్వం విఫలం



బీబీపేట: మండలానికి జూనియర్ కళాశాల సాధించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చంద్రశేఖర్ విమర్శించారు. బుధవారం జూనియర్ కళాశాల సాధన దిశగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు. కళాశాల ఏర్పాటయ్యేంత వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేశ్, శేఖర్, అరుణ్, రమేశ్, రాజేశ్, బాబా, రాజు, శ్రీహరి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల ఫోరం మెంబర్‌గా రాజాగౌడ్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పర్మళ్ల గ్రామానికి చెందిన మరిపల్లి రాజాగౌడ్ ఉమ్మడి జిల్లా కన్జూమర్ ఫోరం(విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక) మెంబర్‌గా నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం ఆయన నిజామాబాద్‌లో బాధ్యతలు స్వీకరించారు. 3సంవత్సరాలు ఈ పదవిలో ఆయన కొనసాగనున్నారు. ఎలక్ట్రిసిటి రెగ్యులేషన్ కమీషన్ ద్వారా నామినేట్ పదవిలో తనను నియమించినట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ఫోరం చైర్మన్ ఈశ్వరయ్య, టెక్నికల్ మెంబర్ ఖిషన్, ఫైనాన్స్ బెంబర్ అశోక్ పాల్గొన్నారు.

నిధులను వినియోగించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట పీహెచ్‌సీలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు నిధులను వినియోగించాలని నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్ సూచించారు. నాగిరెడ్డిపేట పీహెచ్‌సీలో బుధవారం హెచ్‌డీసీ(హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రి అభివృద్ధి కోసం మంజూరైన నిధులను సక్రమంగా వినియోగించాలన్నారు. అవసరమైన పరికరాలను కొనుగోలు చేయాలని చెప్పారు. సమావేశంలో పీహెచ్‌సీ డాక్టర్ సృజన్‌కుమార్, నాగిరెడ్డిపేట, బంజర సర్పంచ్‌లు సునీతా రెడ్డి, అరుణ, డిప్యూటీ తహసీల్దార్ రాందాస్, వైద్య సిబ్బంది రామారావు, కరీముల్లా, మురళి పాల్గొన్నారు.

వ్యక్తి బైండోవర్

భిక్కనూరు: గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా తైబజార్ వసూలు చేస్తున్న ఒకరిని అరెస్ట్ చేసి తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు భిక్కనూరు ఎస్సై ఆనంద్‌గౌడ్ బుధవారం తెలిపారు. కాచాపూర్‌కు చెందిన బండారి సురేష్, తైబజార్ పన్నులు వసూలు చేస్తుండగా, పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు. తహసీల్దార్ ప్రేంకుమార్ ముందు హాజరుపరచగా, రూ.లక్ష సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

డబుల్ నిర్మాణాల్లో బాన్సువాడ నంబర్‌వన్

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న స్పీకర్ పోచారం

బాన్సువాడ: డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణంలో దేశంలో బాన్సువాడ నియోజకవర్గం నంబర్ వన్‌గా ఉందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గం నిర్మించిన ఇళ్లకు సంబంధించి రూ.350 కోట్లకుపైగా బిల్లులు అందించామని తెలిపారు. పట్టణంలోని ఎస్ఎంబీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించుకున్న బాన్సువాడ మున్సిపాలిటీ, మండలం, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహకారంతో బాన్సువాడ నియోజకవర్గానికి 11 వేల ఇళ్లు మంజురయ్యాయన్నారు. ఇందులో 7వేల ఇళ్లు సొంత స్థలాల్లో నిర్మించుకున్నారని, మిగతా 4వేల ఇళ్లను కాంట్రాక్టర్ల ద్వారా ప్రభుత్వ స్థలాల్లో నిర్మించి ఇచ్చామని పేర్కొన్నారు. సొంత స్థలాల్లో డబుల్ బెడ్ రూం ఇల్లు పథకం బాన్సువాడలోనే మొదలైందని, ఇతర జిల్లాల నుంచి బాన్సువాడకు వచ్చి డబుల్ బెడ్‌రూం ఇళ్లు పరిశీలిస్తున్నారన్నారు. గృహలక్ష్మి పథకం కింద నియోజకవర్గానికి 3 వేల ఇళ్లు మంజురయ్యాయన్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప బయటకి వెళ్లవద్దని స్పీకర్ సూచించారు. మరో మూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపిందన్నారు. పాత నివాసాలు, మట్టి గోడల ఇళ్లలో నివసిస్తున్నవారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో భుజంగరావు, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్, నాయకులు రఘు, సంగ్రాం, స్వరూప, సందీప్, ఎజాస్, శ్రీనివాస్, అవారి గంగారాం, జుబేర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యారోగ్య శాఖ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి


డీసీహెచ్ఎస్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

కామారెడ్డి టౌన్: వైద్యారోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని తెలంగాణ మెడికల్ హెల్త్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్, డీసీహెచ్ఎస్ డాక్టర్ విజయలక్ష్మి, ఆర్ఎంవో శ్రీనివాస్‌లకు వినతిపత్రాలను అందజేశారు. కనీస వేతనం, పీఆర్సీ అమలు చేయాలన్నారు. ఏజెన్సీ విధానం రద్దు చేయాలన్నారు. 15 ఏళ్లకు పైగా విధులు నిర్వహిస్తున్న తమకు న్యాయం చేయాలని, లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. యూనియన్ అధ్యక్షుడు దత్తాద్రి, నేతలు నవీన్, పాండు, స్వరూప, రేణుక, శ్రీనివాస్, సాయిలు, తదితరులున్నారు.

నిధుల లేమితో ఇబ్బందుల్లో ప్రజాప్రతినిధులు

రామారెడ్డి: ఎస్ఎఫ్‌సీ, 15వ ఆర్థిక సంఘం నిధులు సకాలంలో అందక సర్పంచులు నానా ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు వారం రోజులుగా ఎడతెరిపిలేని వర్షంతో గ్రామాలలో ఏదో ఒక సమస్య వస్తోంది. ఆ సమస్యలను పరిష్కరించడానికి సర్పంచులు నానా అవస్థలు పడుతున్నారు. గ్రామాలలో పనులు చేయిద్దామన్నా ఎవరూ ముందుకు రావడం లేదు. గతంలో చేసిన పనులకే బిల్లులు రాకపోవడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులకు ఫ్రీజ్ చేయడంతో నిధులు వచ్చే పరిస్థితి లేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు జూన్ నెల విడుదలైనా జులై నెలకు సంబంధించిన నిధులు విడుదల కాలేదని సర్పంచులు చెబుతున్నారు. ఇన్ని సమస్యలున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవడంతో పనులు ఎలా చేయాలని సర్పంచులు ప్రశ్నిస్తున్నారు.

జిల్లా ఆస్పత్రిలో సమస్యల్ని పరిష్కరించండి


వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు, ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆస్పత్రిలో తీవ్రంగా నీటి సమస్య ఉందని, తక్షణమే బోరు వేయించాలని లేని పక్షంలో బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి వేయిస్తాడని అనుమతి ఇవ్వాలని కోరారు. అలాగే నూతనంగా ప్రారంభించబోయే మెడికల్ కళాశాలను జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ప్రారంభిస్తే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని, ఇందుకోసం పాత కలెక్టరేట్ భవనంలో ప్రారంభించాలన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ అవదూత నరేందర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు విపుల్ జైన్, నాయకులు సంతోష్ రెడ్డి, వేణు, గురుమూర్తి, సురేష్, రాజగోపాల్, సంజీవ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

లింగంపేట(ఎల్లారెడ్డి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని సజ్జన్‌పల్లి గ్రామంలో బుధవారం ఆయన సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ ద్వారా ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా నంబర్లు అడిగితే ఇవ్వద్దన్నారు. గ్రామాల్లో చోరీలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు.రైతులు వర్షాలు పడుతున్న సమయంలో బోరు మోటార్ల వద్ద పనిచేయవద్దని సూచించారు. సర్పంచ్ పుట్టి పోచయ్య, సీఐ శ్రీనివాస్, లింగంపేట ఎస్సై శంకర్, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో సైన్స్‌అండ్ టెక్నాలజీ కీలకం



తెయూ(డిచ్‌పల్లి): భారతదేశాభివృద్ధిలో సైన్స్ అండ్ టెక్నాలజీ కీలకపాత్ర పోషిస్తుందని తెయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి అన్నారు. తెయూలో బుధవారం 'ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్' అనే అంశంపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి రిజిస్ట్రార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధికి నూతన ఆవిష్కరణలు ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. ఇందుకు యువ విద్యార్థి మేధావులు ముందుకు వచ్చి పరిశోధనలు కొనసాగించాలని సూచించారు. స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రాజెక్టు సైంటిస్ట్ డాక్టర్ రాధిక వంగాల మాట్లాడుతూ.. ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, పేటెంట్స్, కాపీరైట్స్ ఎలా సాధించాలో తెలిపారు. డాక్టర్ అపూర్వ, డాక్టర్ శాంతకుమారి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులు నిర్మించిన ఘనత కాంగ్రెస్‌దే


ఎస్సారెస్పీ వద్ద నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాల్కొండ: తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులు నిర్మించిన ఘనత కాంగ్రెస్‌దే అని పార్టీ కిసాన్‌ఖేత్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి అన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి 60 వసంతాలు పూర్తయిన సందర్భంగా బుధవారం పార్టీ శ్రేణులు ప్రాజెక్ట్ వద్ద నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తెలంగాణలో భూములు బీడుగా మారకుండ సస్యశ్యామలం చేయుటకు, ఆనాటి కాంగ్రెస్ పెద్దలు తెలంగాణలో అనేక సాగునీటి ప్రాజెక్ట్‌లకు రూప కల్పన చేశారన్నారు. కానీ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్ట్ గొప్పలు చెబుతున్న బీఆర్ఎస్ నాయకులు జూన్‌లో ఆయకట్టుకు చుక్క నీరు ఎందుకు సరఫరా చేయలేదని ప్రశ్నించారు. కేవలం రైతులను మోసం చేయడానికే కాళేశ్వరం డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. రైతుల పక్షాన నిలబడేది కాంగ్రెస్ పార్టీ అన్నారు. కిసాన్‌ఖేత్ జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, నాయకులు వెంకటేశ్, ముత్యంరెడ్డి, భాగ్య పాల్గొన్నారు.


వృద్ధుల సంచార అంబులెన్స్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, పాల్గొన్న ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా, జెడ్పీ చైర్మన్, మేయర్, కలెక్టర్ తదితరులు



'జోస్ అలుక్కాస్ బస్' కీని సూపరింటెండెంట్‌కు అందజేస్తున్న మంత్రి

జీజీహెచ్‌కు బస్సు బహూకరణ అభినందనీయం

నిజామాబాద్ సిటీ: జోస్ అలుక్కాస్ జువెలరీ సంస్థ నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రోగుల సౌకర్యార్థం ఏసీ వాహనాన్ని అందజేయడం అభినందనీయమని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్ రెడ్డి కొనియాడారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో బుధవారం జోస్ అలుక్కాస్ ఫౌండేషన్ సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా ఆస్పత్రికి ఏసీ బస్సును అందజేశారు. దీనిని మంత్రి ప్రారంభించి, మాట్లాడారు. ఈ బస్సు కంటి పరీక్షల శిబిరాలు నిర్వహించడానికి, ఆపరేషన్ చేయించుకున్న వారిని ఆస్పత్రి నుంచి తమ స్వగ్రామాలకు చేర్చడానికి ఉపయోగపడుతుందన్నారు. అనంతరం బస్సు తాళం చెవిని సూపరింటెండెంట్‌కు అందజేశారు.ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా, జెడ్పీచైర్మన్ విఠల్‌రావు, మేయర్ నీతూకిరణ్, నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో సుదర్శనం, జోస్ అలుక్కాస్ ఏరియా మేనేజర్ లెనోజాన్, మేనేజర్ స్మితీష్ తదితరులున్నారు.


జోష్ అలుక్కాస్ బస్సును ప్రారంభిస్తూ..



జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ ఏర్పాటు చేసిన బస్సు.. బస్సులోపలి దృశ్యం


జాన్సన్ అండ్ జాన్సన్ బస్సును ప్రారంభిస్తూ..

క్రైం కార్నర్

చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరి మృతి


చిన్న రాజు(ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన ఊర చెరువులో ఓ వ్యక్తి చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటమునిగి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. బొల్లారం గ్రామానికి చెందిన దడ్డెర అలియాస్ ఇరగదిండ్ల చిన్నరాజు ఈ నెల 23న రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా అతని ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మంగళవారం కుటుంబసభ్యులు చిన్నరాజు అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా బుధవారం ఉదయం బొల్లారం ఊరచెరువులో చిన్న రాజు మృతదేహం తేలింది. చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై లచ్చిరాం తెలిపారు.

నిజాంసాగర్ కెనాల్‌లో పడి యువకుడు..


షేక్ ఆసీఫ్ మృతదేహం

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం కొత్తపేట గ్రామానికి చెందిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు నిజాంసాగర్ కెనాల్‌లో పడి మృతిచెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. కొత్తపేట్‌కు చెందిన షేక్ ఆసీఫ్(23) మంగళవారం ప్రమాదవశాత్తు నిజాంసాగర్ కెనాల్‌లో పడిపోయాడు. స్థానికులు అతని కోసం తీవ్రంగా గాలించినా ఫలితం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు గజ ఈతగాళ్లతో వెతికించగా అర్ధరాత్రి మృతదేహం లభ్యం అయ్యింది. మృతదేహాన్ని పోలీసులు నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి అన్న షేక్ ఆరీఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో ఎక్సైజ్ కానిస్టేబుల్..


గణపతి (ఫైల్)

మద్నూర్(జుక్కల్): మండలంలోని సలాబత్‌పూర్ వద్ద గల అంతర్ రాష్ట్ర ఎక్సైజ్ చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వహించే కానిస్టేబుల్ గణపతి (58) గుండెపోటుతో మృతిచెందినట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. జుక్కల్ మండలంలోని కంఠాలి గ్రామానికి చెందిన గణపతి సుమారు రెండేళ్లుగా మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్ ఎక్సైజ్ చెక్‌పోస్ట్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం పది గంటలకు డ్యూటీ ముగించుకోని గణపతి ఇంటి వెళ్లాడని రాత్రి ఇంట్లో హఠాత్తుగా గుండెపోటు రావడంతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఎల్లారెడ్డిపల్లి హెచ్‌ఎంపై చర్యలు

నిజామాబాద్‌అర్బన్: ఇందల్వాయి మండలం ఎల్లారెడ్డిపేట ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం భూమయ్యపై డీఈవో దుర్గాప్రసాద్ ఎట్టకేలకు చర్యలు తీసుకున్నారు. అనుమతి లేకుండా ఉపాధ్యాయులకు వేతనాలు మంజూరు చేశారని విచారణలో తేలడంతో అతడికి చార్జిమెమో జారి చేశారు. అలాగే ఇన్‌చార్జి హెచ్‌ఎం బాధ్యతల నుంచి తప్పిస్తు ఉత్తర్వులు జారీ చేశారు.

సెలవు దినాలకు వేతనాలు మంజూరు చేయడంతో..

ఎల్లారెడ్డిపల్లి పాఠశాలలో గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు 8 మంది ఉపాధ్యాయులు వివిధ సందర్భాలలో సెలవులను వినియోగించుకున్నారు. ఈ సెలవులకు సంబంధించి సెటిల్మెంట్ కాకుండా, నిబంధనలు పాటించకుండా సంబంధిత ప్రధానోపాధ్యాయుడు వారికి వేతనాలను మంజూరు చేశారు. దీనిపై ఫిర్యాదు అందడంతో జిల్లా విద్యాశాఖ అధికారి విచారణకు ఆదేశించారు. ఈ విచారణలో ఎంఈఓ ప్రొసీడింగ్ లేకుండానే వేతనాలు మంజూరైనట్లు గుర్తించారు. విచారణ అధికారి రాజ్‌గంగారెడ్డి నివేదికను జిల్లా విద్యాశాఖ అధికారికి సమర్పించారు. ఈ నివేదిక ప్రకారం అతడిపై చర్యలు తీసుకున్నారు.

డ్రంకన్‌డ్రైవ్‌లో ఒకరికి రెండురోజుల జైలు

దోమకొండ: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో మండల కేంద్రానికి చెందిన నాగుల రామ్మూర్తి అనే వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్ష పడినట్లు ఎస్ఐ సుధాకర్ బుధవారం తెలిపారు. ఇటీవల రామ్మూర్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడన్నారు. అతడిని కోర్టులో హాజరపర్చగా, కామారెడ్డి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ రెండు రోజుల జైలుశిక్ష విధించారని వివరించారు.

కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్లను క్రమబద్ధీకరించాలి



ఖలీల్‌వాడి: కేజీబీవీ నాన్ టీచింగ్ – వర్కర్లను క్రమబద్ధీకరించాలని, తక్షణమే కనీస వేతనాలను అమలు చేయాలని ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ – వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు బుధవారం మంత్రి ప్రశాంత్‌రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తాలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ.. కేజీబీవీల్లో సిబ్బందికి కనీస వేతనాలు అమలు కాక, శ్రమదోపిడీకి గురవుతున్నారన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలు పెంచుతూ ప్రభుత్వం ఇచ్చిన జీవో నెం.60 కూడా వీరికి అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి కేజీబీవ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని మంత్రి, ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. యూనియన్ రాష్ట్ర నాయకులు హేమలత, కేజీబీవీ సిబ్బంది సంధ్య, సుమలత, సుకన్య, శారద, ప్రేమ, చంద్రకళ, ఉమ, మాధవి పాల్గొన్నారు.

ముగ్గురు సీఐల బదిలీలు

ఖలీల్‌వాడి: మల్టీ జోన్ వన్ పరిధిలో పనిచేస్తున్న 13 మంది సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈక్రమంలో నిజామాబాద్ సీసీఎస్‌లో ఉన్న సీఐ డాబాటా మోహన్ నిర్మల్ జిల్లా ఖానాపూర్ సీఐగా బదిలీ అయ్యారు. అలాగే వెయిటింగ్‌లో ఉన్న సీఐ రవీంధర్ సీసీఎస్‌కు బదిలీ అయ్యారు. ఎస్బీలో సీఐగా పదోన్నతి పొందిన ఎన్ఎస్ ప్రసాద్ డీటీసీ ఆదిలాబాద్‌కు బదిలీ అయ్యారు.

వర్షాలకు కూలిన ఇళ్లు


రాణాకలాన్‌లో కూలిన ఇల్లు


బోర్లంలో కూడిన గోడ

ఎడపల్లి(బోధన్): మండలంలోని రాణాకలాన్ గ్రామంలో గత వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మూడు ఇళ్లు కూలిపోయాయి. గ్రామానికి చెందిన మెట్టు కృష్ణ, తలారి గంగవ్వ, భూమయ్యలకు చెందిన ఇళ్లు కూలిపోవడంతో మూడు కుటుంబాలు నిరాశ్రయులుగా మారాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

గోడ కూలి ఇరువురికి గాయాలు

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం గ్రామం మున్నూరుకాపు కాలనీలో పాత ఇంటిగోడ కూలిపోవడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఇంటిముందు గల కొట్టంలో బుధవారం మంద లచ్చవ్వ, మంద నారాయణ దంపతులు వంట చేస్తుండగా పక్కన ఉన్న వడ్ల లక్ష్మణ్‌కు చెందిన ఇంటి గోడ కొట్టంపై కూలింది. వెంటనే స్థానికులు గాయపడ్డ ఇరువురిని శిథిలాల్లోంచి తీసి బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలిచారు. మంద లచ్చవ్వ కాళ్లు విరిగాయని, నారాయణకు గాయాలైనట్లు సర్పంచ్ సరళ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఘటన స్థలాన్ని బీఆర్ఎస్ నాయకులు వెంకట్రాంరెడ్డి, ఉపసర్పంచ్ మంద శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, సాయికుమార్ తదితరులు సందర్శించారు.

బీబీపేట: గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఉప్పర్‌పల్లి గ్రామానికి చెందిన నర్సగోని మల్లాగౌడ్‌కు చెందిన ఇల్లు కూలింది. దీంతో తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

చోరీ కేసులో ఒకరి అరెస్ట్

- రూ. 1.66 లక్షల నగదు, 20 తులాల వెండి స్వాధీనం


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: మండలంలోని తాడ్కోల్‌లో గతంలో జరిగిన చోరీ కేసులో ఒకరిని అరెస్ట్ చేసి, రూ.1.66 లక్షల నగదు, 20 తులాల వెండిని స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బాన్సువాడ డీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. గత నెల 27న మండలంలోని తాడ్కోల్‌లో టీకారం జైస్వాల్ అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరుగగా, దుండగులు రూ.2.20 లక్షల నగదుతో పాటు కిలో వెండి అపహరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని అన్నారు. బుధవారం తాడ్కోల్ చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో తాడ్కోల్ గ్రామానికి చెందిన బాన్సువాడ సాయిలు అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు, సీసీఎస్ సిబ్బంది పట్టుకుని విచారించారన్నారు. జైస్వాల్ ఇంట్లో తనే దొంగతనం చేశానని ఒప్పుకున్నాడని ఎస్పీ అన్నారు. సాయిలు ఇంట్లో ఉన్న రూ.1.66 లక్షల నగదుతో పాటు 20 తులాల వెండిని స్వాధీనం చేసుకున్నామని అన్నారు. నిందితుడిని రిమాండ్‌కు పంపించనున్నట్లు ఆయన అన్నారు. ఈ కేసును చేధించిన సీఐ మహేందర్ రెడ్డి, సీసీఎస్ సీఐ మల్లేశ్‌గౌడ్, సీసీఎస్ ఎస్సై ఉస్మాన్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

తహసీల్ కార్యాలయం పరిశీలన



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి తహసీల్ కార్యాలయాన్ని ఆర్డీవో రాథోడ్ రమేశ్ బుధవారం పరిశీలించారు. ఆయన ఇటీవల నూతనంగా ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, సిబ్బంది తదితరులున్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



సదాశివనగర్(ఎల్లారెడ్డి): సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాల వాల్‌పోస్టర్లను బుధవారం హైదరాబాద్‌లోని మంత్రి క్వార్టర్స్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జైగౌడ సంఘం జాతీయ అధ్యక్షుడు రామారావు గౌడ్, జైగౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు బొంబోతుల లింగాగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మురళీగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ గౌడ్, సంపత్ గౌడ్, తదితరులున్నారు.

పౌరసరఫరాల జిల్లా అధికారికి స్వాగతం



కామారెడ్డి అర్బన్: పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారిగా బుధవారం బాధ్యతలు చేపట్టిన మల్లికార్జున్‌బాబుకు టీఎన్‌జీవోల సంఘం ప్రతినిధులు స్వాగతం పలికారు. పౌరసరఫరాల శాఖ బలోపేతానికి కృషి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.సాయిలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



బాన్సువాడ: రాష్ట్రంలో విద్యా సంస్థల్లో సీటు సాధించిన బీసీ విద్యార్థుల పూర్తి ఫీజును ప్రభుత్వమే చెల్లిస్తుందని మంత్రి గంగుల కమలాకర్ ప్రకటించడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వనం గంగాధర్ అన్నారు. బుధవారం బాన్సువాడ ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సీఎం కేసీఆర్, స్పీకర్ పోచారం, మంత్రి గంగుల కమలాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ విద్యార్థుల ఫీజు కోసం రూ.150 కోట్లు మంజూరు చేయడం అభినందనీయమని అన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ హజీమియా, నియోజకవర్గ అధ్యక్షులు సంజీవ్, మండల ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, జావిద్, సభ్యులు పాల్గొన్నారు.

వీధుల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): వీధుల్లో ఎక్కడా కూడా నీటినిల్వలు లేకుండా చూడాలని నాగిరెడ్డిపేట ఎంపీవో శ్రీనివాస్ సూచించారు. నాగిరెడ్డిపేట గ్రామపంచాయతీ కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. దీంతోపాటు పంచాయతీ కార్యాలయం ద్వారా జరిపిన ఆర్థిక లావాదేవాలకు సంబంధించిన రసీదులను తనిఖీ చేశారు. నీటినిల్వలు ఉన్న చోట ఆయిల్‌బాల్స్ వేయించాలని, గ్రామంలోని ప్రతివార్డ్‌లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు. దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయించాలని సూచించారు. సర్పంచ్ సునీతారెడ్డి, పంచాయతీ కార్యదర్శి కార్తీక్ ఉన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలి

కామారెడ్డి టౌన్: జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్లలోని సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పలు హాస్టళ్లను సందర్శించి పరిశీలించారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని, సీజనల్ వ్యాధులతో విద్యార్థులు అనారోగ్యాలపాలవుతున్నారని, వైద్య సేవలు అందించాలన్నారు. మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ శివ ప్రసాద్, నాయకులు జస్వంత్, స్వాతి క్‌రాజ్, రిత్విక్ తదితరులున్నారు.

లేని ఇంకుడు గుంత ఉన్నట్లుగా..

- స్వచ్ఛ సర్వేక్షణ్ పథకం కింద గతంలో భవానీపేట గ్రామం ఎంపిక
- కేంద్ర అధికారులు రావడంతో ఆగమేఘాల మీద నిర్మాణాలు
- ఇదేంటని ప్రశ్నించిన గ్రామస్తులు



డీఎల్‌పీవోను నిలదీస్తున్న గ్రామస్తులు

లింగంపేట(ఎల్లారెడ్డి): లేని ఇంకుడు గుంతను ఉన్నట్లుగా మెరుగులు దిద్ది చూపిస్తున్న అధికారులను నిలదీసిన ఘటన బుధవారం భవానిపేటలో చోటుచేసుకుంది. వివరాలు.. స్వచ్ఛ సర్వేక్షణ్ కింద ఎంపికైన భవానిపేట గ్రామాన్ని డీఎల్‌పీవో సురేందర్, ఉపాధి సిబ్బంది సందర్శించారు. ఈ క్రమంలో కేంద్ర అధికారి సునీల్‌గౌడ్‌కు చూపడానికి తాత్కాలికంగా ఇంకుడు గుంతను ఏర్పాటు చేశారు. గ్రామంలో మరుగుదొడ్లు వాడుతున్నారా, చెత్త ట్రాక్టర్ ద్వారా సేకరిస్తున్నారా, ఇంకుడు గుంతలు వాడుతున్నారా, స్కూల్, అంగన్‌వాడిల్లో పల్లె దవఖానా కొనసాగుతుందా, గ్రామ పంచాయితీలో మరుగుదొడ్లు వాడుతున్నారా అని గ్రామంలో ఇంటింటికి తిరిగి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో డీఎల్‌పీవో, అధికారులు పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాల్లో సైతం పరిశీలించారు. వారు ఇంకుడు గుంతలు, గదులలో ఫ్యాన్లు లేకున్నా ఉన్నాయి అని చెప్పాలని ఉద్యోగులపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. అవి పని చేయడంలేదని చెప్పడంతో మీకు సెన్సు ఉందా అలా ఎందుకు చెప్తారు పనిచేస్తున్నాయని చెప్పాలని వారించినట్లు తెలిపారు. అలాగే పల్లె దవఖానా ముందు లేని ఇంకుడు గుంతను తాత్కాలికంగా కంకర, ఇసుక నేలపై పోసి ఇటుకలు పెట్టి సున్నం వేయించి ఫొటోలు దిగడానికి సిద్ధం చేశారు. విషయం తెలుసుకున్న పలువురు గ్రామస్తులు అక్కడికి చేరుకొని లేని ఇంకుడు గుంతను ఉన్నట్లుగా ఎందుకు చూపిస్తున్నారని ప్రశ్నించారు. మీరెవరూ నన్ను ప్రశ్నించడానికి మీకు చెప్పాల్సిన అవసరం లేదని అసభ్యకరంగా మాట్లాడినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. అలాగే పల్లె ప్రకృతి వనానికి దారి లేక నిరుపయోగంగా మారిందని డీఎల్‌పీవోగా మీరు పట్టించుకోవాలని నిలదీశారు. మీరు నాకు చెప్పవద్దని హెచ్చరించినట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి నిధులు రాబట్టి అభివృద్ధి చేయాల్సిన అధికారులు లేనిది ఉన్నట్లు సృష్టించి ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు ఇస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు.



భవానిపేటలో అప్పటికప్పుడు నిర్మించిన తాత్కాలిక ఇంకుడు గుంత

ఘనంగా శశాంక్ జన్మదిన వేడుకలు



శశాంక్‌కు గజమాల వేస్తున్న బీఆర్ఎస్ నేతలు

భిక్కనూరు: ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ తనయుడు, బీఆర్ఎస్ నేత గంప శశాంక్ జన్మదిన వేడుకలను బుధవారం భిక్కనూరులో ఘనంగా నిర్వహించారు. ఆయన అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణులు ర్యాలీ చేశారు. స్థానిక చౌరస్తా వద్ద అభిమానులు గంప శశాంక్‌కు కత్తిని బహూకరించి పెద్ద గజమాలను మెడలో వేశారు. తదుపరి స్థానిక ఎస్వీ గార్డెన్‌లో పెద్ద కేకును శశాంక్ చేత కోయించి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లట్లు పంపిణీ చేశారు.

విద్యుత్ అధికారులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

- నస్రుల్లాబాద్ సర్వసభ్య సమావేశం



విద్యుత్ శాఖ ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజాప్రతినిధులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం ఎంపీపీ పాల్త్య విఠల్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. సమావేశంలో అధికారులు మూడు నెలల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సభలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంకట రమణ మాట్లాడుతూ..అంకోల్ క్యాంపులో 8 నెలలుగా హైఓల్టేజీ కారణంగా సమస్య ఉత్పన్నమవుతోందని, ఈ విషయం గురించి పలుమార్లు విద్యుత్ శాఖ ఏఈ అరవింద్‌కు చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని.. హైఓల్టేజీ సమస్యపై తనకు ట్రెయినింగ్ ఇవ్వలేదని, సాయంత్రం 5 గంటల తర్వాత తనతో మాట్లాడవద్దని ఏఈ చెప్పారని వెల్లడించారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటు చేసిన సోలార్ మీటర్ల కోసం దరఖాస్తు ఫారాలను రెండు సంవత్సారాలలో 5 సార్లు ఇచ్చానని, కాని ప్రతిసారి పోయాయి మళ్లీ తీసుకుని రండి అంటూ తిప్పుతున్నారని వాపోయారు. తమ గ్రామంలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఒక్క సారి కూడా గ్రామానికి రాలేదన్నారు. నిత్యం హైఓల్టేజి సమస్య ఉందని తమ ఇంటి చుట్టూ ప్రజలు తిరుగుతున్నారని, తమ ఆవేదనను సభ అధ్యక్షుడి దృష్టికి తీసుకు వచ్చారు. ట్రెయినింగ్ ఇవ్వకుంటే ఎలా ఉద్యోగం చేస్తున్నారని, మీ పరిధి కాకుంటే విద్యుత్ సమస్యలను ఎవరిని అడగాలని వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులతో మాట్లాడే తీరు మార్చుకోవాలని లేకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే పలు సమస్యలు సభ దృష్టికి వచ్చాయి. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఏంపీవో రాము, గిర్దావార్ అంజు, సర్పంచ్‌లు రాము, సాయిలు, సత్యనారాయణ, చంటి, బద్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద ఉద్యోగులకు పేస్కేలు అమలు చేయాలి



బాన్సువాడ: సమగ్ర బాలల పరిరక్షణ విభాగం ఒప్పంద ఉద్యోగులు బుధవారం బాన్సువాడలో అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఒప్పంద ఉద్యోగులకు పేస్కేల్ అమలు చేయాలని, క్రమబద్ధీకరించాలని కోరారు. ఒప్పంద ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని స్పీకర్‌కు విన్నవించారు.

ప్రతి కుటుంబం మరుగుదొడ్లను నిర్మించుకోవాలి



మాచారెడ్డి/కామారెడ్డిరూరల్/బాన్సువాడ రూరల్: ప్రతి కుటుంబం మరుగు దొడ్లు నిర్మించుకోవాలని స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ పథకం కేంద్ర పరిశీలక బృందం సభ్యులు సూచించారు. ఇంకుడు గుంతలు, కంపోస్ట్ షెడ్లు, మరుగు దొడ్లు, స్కూళ్లు, అంగన్‌వాడీలను వారు పరిశీలించి అవగాహన కల్పించారు. రికార్డులను తనిఖీ చేశారు.

రేషన్ డీలర్ తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

బిచ్కుంద(జుక్కల్): హజ్గుల్ గ్రామం రేషన్ డీలర్‌ను రెవెన్యూ అధికారులు తొలగించి కేసు నమోదు చేశారు. సాక్షి దినపత్రికలో ఈ నెల 22న 'రేషన్ పంపిణీలో అక్రమాలు' అని వచ్చిన వార్తా కథనానికి అధికారులు స్పందించారు. గ్రామానికి వెళ్లి జరిగిన అక్రమాలపై లబ్ధిదారులతో మాట్లాడి విచారణ చేపట్టారు. అక్రమాలకు పాల్పడినట్లు అధికారుల విచారణలో తేలింది. దీంతో డీలర్‌పై కేసు నమోదు చేసి సస్పెండ్ చేసినట్లు ఆర్ఐ సాయిబాబా తెలిపారు. తాత్కాలికంగా బిచ్కుందకు చెందిన రేషన్ డీలర్‌ను ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చి లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

ఆధ్యాత్మికం

భగళాముఖి అమ్మవారికి పూజలు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలోని భగళాముఖి అమ్మవారి పీఠంలో బుధవారం అమ్మవారి జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి నెలా అష్టమి తిథిన అమ్మవారి జన్మదినం సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి అన్నదానం చేసినట్లు పీఠాధిపతి క్రాంతి పటేల్ తెలిపారు.

ఘనంగా ఖాసీందుల పీర్ల సవారీ

బాన్సువాడ రూరల్: బోర్లం, హన్మాజీపేట్, పోచారం తదితర గ్రామాల్లో బుధవారం రాత్రి ఖాసీందుల పీర్ల సవారీని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. భక్తులు ఊదు, బెల్లం, కొబ్బరి కాయలు, మలిద, శర్బత్‌ను నైవేద్యంగా సమర్పించారు. బాజాభజంత్రీల నడుమ పీర్లను గ్రామంలో ఊరేగించారు.

శారీరకంగా దృఢంగా ఉండాలి

కామారెడ్డి అర్బన్: మనిషి జీవితం తన మనసు స్థితి మీదనే ఆధారపడి ఉంటుందని, మారాల్సింది ఎదుటివారు కాదని, మనమే అనే సంగతి మరిచి పోవద్దని హైదరాబాద్ అక్షరధామ్ సాధు ప్రచారక్ సంత్ విమల్ ముని అన్నారు. బుధవారం కామారెడ్డి స్నేహపురి కాలనీలోని ఎస్ఎస్‌వై యోగా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. శారీరంగా, మానసికంగా ధృడంగా లేకపోతే ఎంత సంపద ఉన్నా ఫలితాన్ని పొందలేమని ఆయన అన్నారు. ఒత్తిడిని దూరం చేసుకోవాలన్నారు. యోగా, స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.రాంరెడ్డి, యోగాచార్యులు గరిపల్లి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

చుక్కాపూర్‌లో సుదర్శన హోమం

మాచారెడ్డి: చుక్కాపూర్ గ్రామంలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో బుధవారం నారసింహ, సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం అభిషేకం, తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. కార్యక్రమంలో ఈవో ప్రభు రామచంద్రం, అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

రామారెడ్డి: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యులు, ఆశ వర్కర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీపీ దశరథ్‌రెడ్డి సూచించారు. అన్నారం గ్రామంలోని పీహెచ్‌సీని బుధవారం ఆయన సందర్శించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తితే వైద్య సాయం వెంటనే అందించాలని కోరారు.

అక్రమ నిర్మాణం తొలగింపు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో జాతీయ రహదారిపై అక్రమంగా నిర్మించిన షెడ్డును మున్సిపల్ అధికారులు బుధవారం తొలగించారు. పట్టణ పోలీసుల బందోబస్తుతో, టౌన్ ప్లానింగ్ అధికారులు షెడ్డును కూల్చివేయించారు. టీపీవో గిరిధర్ మాట్లాడుతూ.. జాతీయ రహదారికి ఆనుకుని రోడ్డుపై దుకాణం ఉండటంతో కూల్చి వేయించామన్నారు. రోడ్డును అక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

సమాచారం..

28న ఉచిత సంతాన సాఫల్య శిబిరం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణం రామారెడ్డి రోడ్డులోని మాతృశ్రీ ఆస్పత్రిలో ఈనెల 28న ఉచిత సంతాన సాఫల్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యులు జి.ప్రీతిరెడ్డి, టి.శ్రావణికరెడ్డిలు తెలిపారు. కన్సల్టేషన్‌తో పాటు, పరీక్షలు, స్కానింగ్, కౌన్సెలింగ్ , థైరాయిడ్, సిమెన్ అనాలసిస్, తదితర పరీక్షలు అవసరాన్ని బట్టి ఉచితంగా నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.

నవోదయలో అడ్మిషన్లకు ఆగస్టు 10 తుది గడువు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): నవోదయ పాఠశాలలో 6వ తరగతిలో అడ్మిషన్ల కోసం ఆగస్టు 10 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో వెంకటేశం బుధవారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా సీట్లను కేటాయిస్తామన్నారు.

'వైద్య ఆరోగ్యశాఖలో రాజ్యమేలుతున్న అవినీతి'



కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో అవినీతి రాజ్యమేలుతోందని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అవినీతికి కేరాఫ్‌గా వైద్య ఆరోగ్య శాఖను మార్చారన్నారు. వైద్య శాఖ అధికారితో పాటు మరి కొందరు.. ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్, ల్యాబ్ సెంటర్‌ల నుంచి అనుమతులు, రెన్యూవల్ పేరిట అక్రమంగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంల పోస్టుల భర్తీలో రూ.లక్షల్లో వసూలు చేశారని అన్నారు. తక్షణమే వైద్యారోగ్య శాఖను గాడిలో పెట్టి, ప్రజల ప్రాణాలను కాపాడాలన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

లింగంపేట(ఎల్లారెడ్డి): సమగ్ర శిక్ష సంఘం లింగంపేట మండల అధ్యక్షుడిగా కొండ సంజీవ్‌కుమార్‌ను బుధవారం ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా సామల రాజు, కోశాధికారిగా శ్రీవాణి, ఉపాధ్యక్షుడిగా ఎన్ సంజీవ్, ఉపాధ్యక్షురాలిగా శ్యామలను ఎన్నుకున్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు అన్నారు.

నెహ్రూ యూత్ క్లబ్ నూతన కార్యవర్గం..

కామారెడ్డి రూరల్: దేవునిపల్లి గ్రామ నెహ్రూ యూత్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గూడెల్లి రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా కాసర్ల భానుచందర్, తదితరులు ఎన్నికయ్యారు.

భూమిలో అధిక తేమ లేకుండా చూసుకోవాలి



కాస్లాబాద్‌లో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏవో

పెద్దకొడప్‌గల్(జుక్కల్): భూమిలో అధిక తేమ లేకుండా చూసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నదీమ్ తెలిపారు. బుధవారం కాస్లాబాద్ శివారులో పత్తి, సోయా పంటలను ఆయన పరిశీలించారు. సాగు చేస్తున్న పంటలలో పాటించవలసిన మెలకువల గురించి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. పంట చేలల్లో లోతుగా కాలువల తీసి నీరుని బయటికి తీసివేయాలని సూచించారు.

ఎంగ్రియాల్‌లో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎండ్రియాల్ శివారులో బుధవారం ఎల్లారెడ్డి వ్యవసాయ సహాయ సంచాలకురాలు రత్న పంటలను పరిశీలించారు. పంటల చేలల్లో ఉన్న అధిక వర్షపు నీటిని వెంటనే తొలగించాలని సూచించారు. ఏవో శ్రీకాంత్, ఏఈవో రాకేష్, తదితరులు ఉన్నారు.

మణిపూర్‌లో శాంతి భద్రతలను కాపాడాలి



జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కామారెడ్డి టౌన్: మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి, శాంతి భద్రతలను కాపాడాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ముందు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. మణిపూర్‌ని అగ్ని గుండంలా రాష్ట్ర బీజేపీ ప్రభుత్వం మార్చిందని ఆరోపించారు. అక్కడ మహిళకు, ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నేతలు మోతీరాం నాయక్, అరుణ్, ప్రకాష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దాడులను అరికట్టాలి

ఎల్లారెడ్డి: మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని బీఎస్పీ నాయకులు సాయిబాబా అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మణిపూర్‌లో మహిళల రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు.

నీట మునిగిన పంటలు



తాడ్వాయిలో మునిగిన మొక్క జొన్న పంట



అంజని గ్రామంలో కూలిన ఇల్లు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. నిర్విరామంగా వర్షం కురియడంతో పంటలు నీట మునిగాయి. సంతాయిపేట్, ఎర్రాపహాడ్, కాలోజివాడి, బ్రాహ్మణపల్లి తదితర గ్రామాలలో ఉన్న చెరువులన్నీ నిండిపోయాయి. ప్రభుత్వం స్పందించి నీటిలో మునిగిన పంటలను సర్వే చేయించి రైతులకు నష్ట పరిహారం ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.

అంజని గ్రామంలో ఇల్లు..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఎడతెరపివ్వని వర్షాలతో మండలంలోని అంజని గ్రామానికి చెందిన కొలాస్ పోశయ్య ఇంటి వెనుక భాగం మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి పూర్తిగా కూలిపోయింది. ఉన్న ఇల్లు కూలిపోవడంతో ఉండడానికి ఇబ్బందిగా ఉందని, ప్రభుత్వం ఆదుకోవాలని పోశయ్య కోరారు.

ఇళ్లల్లోకి కుంట నీరు

మాచారెడ్డి: పాల్వంచ మండల కేంద్రంలోని కుంట నీరు దాని సమీపంలోని ఎస్సీ కాలనీలోకి వచ్చాయి. కుంట తూము మూసుకుపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని కాలనీవాసులు వాపోయారు. రెండేళ్లగా అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా లాభంలేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు.

వేతనాలు పెంచే వరకు సమ్మె ఆగదు



ఎల్లారెడ్డిలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం



నస్రుల్లాబాద్ ఎంపీపీ విఠల్‌కు వినతి ప్రతం..

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు జిల్లా వ్యాప్తంగా చేపట్టిన సమ్మె బుధవారం కూడా కొనసాగింది. వేతనాలు పెంచి, తమ సమస్యలన్నీ తీర్చేవరకు సమ్మె కొనసాగిస్తామని జీపీ కార్మికులు స్పష్టం చేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, జీవో- 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండు చేశారు. పలు పార్టీల నాయకులు సంఘీభావం తెలిపి.. కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



తాడ్వాయిలో ..



మాచారెడ్డిలో మాట్లాడుతున్న బీఎస్పీ నేత

సంక్షిప్తం

ప్రతి ఒక్కరు మొక్కల్ని నాటాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రతి ఒక్కరు మొక్కలను నాటాలని ఎంపీడీవో రాజ్‌వీర్ సూచించారు. తాడ్వాయి మండల కేంద్రంలో బుధవారం హరితహారంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ మొక్కలను పంపిణీ చేశారు. మొక్కల వల్ల కలిగే లాభాల గురించి ఆయన వివరించారు. వైస్ ఎంపీపీ ముదాం నర్సిములు, సర్పంచ్ సంజీవులు, పాల్గొన్నారు.

తిరుపతిలో కుప్రియాల్ వాసుల భజన కీర్తనలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): కుప్రియాల్ గ్రామానికి చెందిన భజన మండలి సభ్యులు బుధవారం తిరుమల తిరుపతిలో భజన కీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అఖండ హరినామ సంకీర్తనలో భాగంగా రెండు రోజుల పాటు భజన కీర్తనలు ఆలపిస్తున్నట్లు తెలిపారు.

93వ రోజుకు చేరుకున్న నిరసన దీక్షలు

భిక్కనూరు: ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ విడుదల చేసే వ్యర్థాల నుంచి రక్షించాలంటూ వీడీసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు బుధవారం నాటికి 93వ రోజుకు చేరుకున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామస్తులు దీక్ష శిబిరంలో నిలబడి తమ నిరసనను తెలిపారు.

కొనసాగుతున్న స్వీపర్ల దీక్షలు

కామారెడ్డి రూరల్: తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ పార్ట్‌టైం స్వీపర్ల సంఘం ఆధ్వర్యంలో కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 31వ రోజుకు చేరుకున్నాయి. జిల్లా కేంద్రంలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.

శబరిమాత ఆశ్రమాన్ని దర్శించుకున్న మెజిస్ట్రేట్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమాన్ని బుధవారం కామారెడ్డి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి(మెజిస్ట్రేట్) కుమారి హారిక దర్శనం చేసుకున్నారు. ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు హారికను సన్మానించారు.

భిక్కనూరులో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం

భిక్కనూరు: మండల కేంద్రంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధిచిన నిధుల మంజూరు ఉత్తర్వు కాపీలను ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ బుధవారం విండో అధ్యక్షుడు గంగల భూమయ్యకు అందజేశారు. రూ. 32 లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని ఆయన సూచించారు. విండో వైస్ చైర్మన్ ముచ్చర్ల రాజిరెడ్డి, ఎంపీపీ గాల్‌రెడ్డిపాల్గొన్నారు.

